# ఇప్పుడు నేను చెబుతున్నది మానవుడే మహనీయుడనీ కాదు— అతడు ఓ భయంకర జంతువనీ కాదు. ఈ సమాజం విషసర్పాల విలయతాండవమనీ కాదు— అది మహాత్ముల సమూహమనీ నే చెప్పటం లేదు.

మనిషంటే— మేఘాల్లా ముంచుకొచ్చే దుఃఖాల దొంతర్లమాటున తళుక్కున మెరిసి మాయమయ్యే మెరుపుల్లాటి సుఖాలకోసం ప్రాకులాడే ఆశాజీవి అంటాను. బ్రతుకంటే— సాహసమనీ, సంఘర్షణ అనీ, మిథ్యా గమ్యానికి చేరాలన్న వ్యర్థప్రయత్నమనే నేనంటాను. 'క్రిస్టఫర్' జీవితాన్ని పరిశీలించినప్పుడు నాకు కలిగిన అభిప్రాయమే అది.

* * * *

అది పల్లెల అమాయకత్వాన్ని, పట్టణాల నవ్యత్వాన్ని కలబోసుకున్న ఒక చిన్నపట్నం. ఆ చిన్నపట్నంలో ఒక పురాతన చర్చి. ఎత్తుగావున్న ఆ చర్చికి ముప్ఫైమెట్లు. ఈ చర్చి మెట్లపైనే 'క్రిస్టఫర్' ఓ సాహసం చేయబోతున్నాడు. అప్పుడు, ఆ ఊరి జనమంతా ఈ చర్చి చుట్టూనే చేరారు. ఆ రోజు ఆ ప్రాంతమంతా జనంతో కిటకిటలాడి పోతోంది. "క్రిస్టఫర్' 'మేరీ' వివాహం కూడా ఈ చర్చిలో అప్పుడే జరిగింది.

ఆ క్రొత్తజంట చర్చి ముఖద్వారం దాటి మెట్లమీదుగా నడుస్తున్నారు. అక్కడ చేరిన జన సమూహం వారివైపే భయం భయంగా ఆత్రుతతో చూస్తోంది. ఓ భయంకర మృత్యుభూతం ఆకలితో వారిని ఆవహించటానికి ఎదురుగా వస్తున్నది. అందుకే అందరి కళ్ళల్లో ఆ విషాద ఛాయ. ఫోటోగ్రాఫర్లు వారిని ఫోటోలు తీసుకొంటూ పోతున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం ప్రతి ఒక్కరినీ కుదిపేస్తోంది. గుండెలు అరచేతిలో పట్టుకొని అందరూ వారివైపే చూస్తున్నారు.

దానికి కారణం, 'క్రిస్టఫర్', 'మేరీ' దిగుతున్నవి మామూలు మెట్లు కావు. భయంకర మృత్యు సోపానాలు. అవి ఎందరి వైవాహిక జీవితాల్ని మట్టుపెట్టాయో!? ఆ చర్చిలో ఏజంట వివాహం చేసుకున్నా వారిలో ఎవరో ఒకరు ముప్ఫై మెట్లూ దిగేలోపు మరణించక తప్పదు. ఇప్పుడు 'క్రిస్టఫర్', 'మేరి' కాలిడబోతున్నది పదో మెట్టుపైనే! ఈ మెట్టుపైనే అభం శుభం తెలియని రెండు జంటలు అసువులు బాసింది కూడాను. అందరూ ఏం జరుగుతోందనన్న ఆత్రుతతో వారివైపే చూస్తున్నారు.

చర్చిలో రోజూ ప్రార్థనలు జరుగుతాయి. మెట్లు ఎక్కేవారూ, దిగేవారూ ఎందరో వున్నారు. కానీ, వీరికేమీ కాదు. ఆ చర్చిలో వివాహం చేసుకొన్న క్రొత్త జంటకు మాత్రం ఈ మెట్లపై మృత్యువాత తప్పదు. అది గొప్ప విశేషమై ప్రపంచమంతా ప్రసిద్ధి చెందింది. ఎందరో దేశీయులూ, విదేశీయులు ఈ మెట్లలో దాగిన మర్మాన్ని తెలుసుకోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ, వారికి ఆ మెట్లలో ఏ లోపమూ కనబడలేదు. "అంతా బూటకం! ఇక్కడ ఏమీ లేదు" అంటూ ఎందరో సాహసం చేసి చర్చిలో పెళ్ళి చేసుకుని ఈ మెట్లపై నడవబోయారు. ప్రాణాలు కోల్పోయారు.

కొన్ని క్షుద్రశక్తులు ఆ మెట్లను ఆవహించాయనీ, అవి కొత్తగా పెళ్ళైన వధూవరులనే ఏరికోరి చంపేస్తాయనీ దేశమంతా గొప్ప ప్రచారం. ఈ విషయంపై 'రీసెర్చి' చేస్తామంటూ చాలా మంది యువకులు ముందుకొచ్చారు. వారిలో భయమేసి పారిపోయిన వారు కొందరైతే, ఆ బలికి సమిధలైన వారు కొందరు. అందుకే ఆ చర్చిలో వివాహాలు ఇప్పుడు జరగటం లేదు. ఇక్కడ వివాహం చేసుకుంటాం అంటూ ముందుకు వచ్చేవారే లేరు. ఈ మెట్లలో దాగిన రహస్యం ఎవరికీ అంతుచిక్కటమూ లేదు.


ఆ సమయంలో ఇరవై అయిదేళ్ళ కుర్రాడు ఈ విషయంపై 'రీసెర్చి' చేసి రహస్యాన్ని బట్టబయలు చేస్తానంటూ వెలుగులోకొచ్చాడు. అందరూ అతనికేసి జాలిగా చూశారు. "ఎందుకయ్యా! లేనిపోని బాధలు కొని తెచ్చుకుంటావ్! అంటూ నిరుత్సాహ పరచారు కొందరు. "బంగారు భవిష్యత్తు బుగ్గిపాలు చేసుకోకు!" అంటూ హెచ్చరించారు మరికొందరు. అయినా, అతని పట్టుదల సడలలేదు. "ఏమైనా, ఈ సమస్యకు సమాధానం చెప్పితీరుతాను" అంటూ దృఢంగా పలికాడు. అతని పేరే 'రాంబాబు'.

రాంబాబు పూర్తిగా ఈ పనిలో నిమగ్నమయ్యాడు. చర్చి దగ్గిరే రాత్రింబవళ్ళు గడిపాడు. అతనికి ఆ చర్చి మెట్లపై ఏ లోపమూ కనబడలేదు. ఆ పట్నంలో చాలా మందిని ఈ చర్చి గూర్చి వాకబు చేశాడు. అతనికేమీ అంతు చిక్కలేదు. చర్చి అధిపతిని కూడా కలిసాడు. కానీ, తనకు కావలసిన సమాధానం దొరకలేదు. ఒక రోజున రాంబాబు 'చర్చివాచ్‌మెన్'ని కలసి కొన్ని ప్రశ్నలడిగాడు. ఆ జవాబులకు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. కారణం. అతను ఊహించని ఒక నిజం బయటపడింది.

* * * *

రాంబాబు. 'వాచ్‌మెన్' చెప్పిన ప్రకారం పోలీస్ స్టేషన్‌లోని ఎఫ్.ఐ.ఆర్. ఒక్కమారు త్రిప్పి చూశాడు. పది సంవత్సరాల క్రితం జరిగిన ఒక దుస్సంఘటన అప్పడతనికంటబడింది. రెండు మనసులు కలిసిన ఒక జంట శాశ్వతంగా దగ్గరవ్వాలనీ, తమ ప్రేమకు ఎదురులేదని నిరూపించాలనీ ఆ మెట్లపైకాలుపెడుతున్న సమయాన ఒక ఉక్కుపాదం వారిని కర్కశంగా నలిపేసింది. ఆ తరువాత నుండే ఎందరో వధూవరులు ఈ మెట్లు దిగుతూ మృత్యుకోరల్లో ఇరుక్కుపోయింది. ఆ ఇద్దరి ప్రేతాత్మలే ఈ మెట్లపై నివాసముండి, ఏరికోరి నూతన వధూవరులనే ఆవహించి చంపేస్తున్నాయేమో అన్న భయంతో రాంబాబు వణికిపోయాడు. అతని మస్తిష్కంలో తుఫానులా కలవరం చెలరేగింది. 'మెట్లలో దాగిన రహస్యం ఏమిటబ్బా? ఈ సమాజానికి ఎట్లా చెప్పేది?' ఇట్లా ఆలోచిస్తూంటే అతని గుండె బరువెక్కిపోయింది. భారంగా కళ్ళు మూసుకొన్నాడు.

ఆ క్షణాన అతని కళ్ళలో ఒక రంగుల చిత్రం మెదిలింది. అందులో, వృద్ధాప్యంలో వున్న అతని తల్లిదండ్రులూ పెళ్ళి కావలసిన తన చెల్లెలూ స్పష్టంగా కనబడుతున్నారు. వారి వెనకగా కూలిపోటానికి సిద్ధంగా వున్న చిన్న పెంకుటిల్లు కనబడీ కనబడనట్లుగా వుంది. అతని ఆలోచనలు ఒక్కసారిగా ఆగిపోయినయ్! అందుకు కారణం కొన్ని బాధ్యతలతో అతని భవితవ్యం ముడిపడి వుండటం. చెల్లికి పెళ్ళి చేయాల్సిన బాధ్యత రాంబాబుది. ఉన్న కాస్త పొలం అమ్మి చెల్లెల్ని పంపేసినా, అమ్మానాన్నను వృద్ధాప్యంలో చూడాల్సినధర్మం తనది. వాళ్ళ రెక్కల కష్టంతో పెరిగిన ఆ కాయం వాళ్ళకు అన్యాయం చేయాల్సిన సమయం కాదిది. ధైర్యం



# నమ్మకం

వి. ఎస్. భరత్ భూషణ్

చేసి ఏదైనా సాహసం చేస్తే కుటుంబ పరిస్థితి ఏమిటి? అన్నది అతని ముందున్న ప్రథమ సమస్య.

రాంబాబు ఈ విషయంపై బాగా ఆలోచించాడు. నిస్సారంగా, నిస్సత్తువగా, భయం- భయంగా జీవితాన్ని వెళ్ళదీసే మనుషులంటే అతని కసహ్యం. ఆ బ్రతుకుల్లో సార్థకత ఏమిటన్నది అతని ప్రశ్న. ఈ జీవన పోరాటంలో ఓడిపోకూడదన్నది అతని ఆరాటం. ఈ జన్మకు ఒక సార్థక్యాన్ని ఏర్పరచుకోవాలన్నదే అతని ఆశ. 'పుట్టటం, గిట్టటం ఏ జీవికీ పరమార్థం కాదు, కారాదు'- అన్నదే అతని ఆశయం. అందుకే రాంబాబు ఆ చర్చిలో పెళ్ళి చేసుకొని ముప్ఫై మెట్లూ దిగి 'ఇక్కడ ఏమీ లేవు' అని ఈ ప్రపంచానికి నొక్కి చెప్పాలనుకొన్నాడు. తన ఈ దృఢ నిశ్చయాన్ని అమ్మా నాన్నకు చెప్పి ఒప్పించాడు. ఆ రోజు చర్చి దగ్గరకు మీరూ రావాలని ప్రాధేయపడ్డాడు. తన గమ్యం చేరుకోవటంకోసమే రాంబాబు 'క్రిస్టఫర్'గా మారిపోయాడు. తన క్లాస్‌మేట్ 'మేరి'ని జీవిత భాగస్వామిగా ఎంచుకొన్నాడు. ఆమెను ఒప్పించాడు.

ఇప్పుడు 'క్రిస్టఫర్' దిగుతున్నది ఇరవై మూడో మెట్టే, మిగిలిన ఆ ఏడు మెట్లూ సప్త సముద్రాలు. ఏ మెట్టుపై మృత్యుభూతం పొంచి వుందోనన్న భయం అందరినీ కలవరపెడుతోంది. అందరూ వారివంకే భయం భయంగా ఆత్రుతతో చూస్తున్నారు.

* * * *

"నువ్వే రక్షించాలి?"

అంటూ ఆకాశం కేసి చూసిన తల్లి మౌన వేదన ఆ మృత్యువును తరిమేసిందో, వణుకుతున్న కాళ్ళతో ఆర్ద్రంగా చూస్తున్న తండ్రి చూపులు ఆ భూతాన్ని కట్టివేశాయో, చిట్టి చెల్లెలి చెక్కిళ్ళపై కారుతున్న కన్నీళ్ళు ఆ పాషాణ హృదయాన్ని కదిలించాయో, కరిగించాయో 'క్రిస్టఫర్' 'మేరి' ముప్ఫై మెట్లూ దిగిపోయారు.

ఆ ఆనందంతో క్రిస్టఫర్ పరిగెత్తుకుంటూ వచ్చి చెల్లెల్ని గాఢంగా కౌగిలించుకొన్నప్పుడు అతని కంటి వెంట రెండు కన్నీటి బొట్లు రాలాయి. అవి కన్నీటి బొట్లు కావు. జీవన్మర



ణాల మధ్య తల్లడిల్లిన హృదయం కక్కిన రక్తపుబొట్లు. క్రిస్టఫర్ అప్పడే చూశాడు– తన తల్లి మొదలు కొట్టిన చెట్టులా కూలిపోవటం. బిగిసిన తన చేతులు విడివడి నిస్తేజంగా వణికి పోయాయ్. ఆనందం నిండిన అతని కళ్ళు ఎర్రబడి ఎండిపోయాయ్. అక్కడి జనమంతా ఇప్పడు నేలకొరిగిన క్రిస్టఫర్ తల్లిచుట్టూనే చేరారు. "క్రిస్టఫర్ ని ఆవహించాల్సిన ఆ క్షుద్రశక్తులు అతని తల్లిని పీడించి చంపేశాయ్. అతను లేనిపోని ప్రయాసలుపడి తల్లిప్రాణాలు పోగొట్టుకొన్నాడు. ఈ మెట్లపై క్షుద్ర శక్తులున్నాయంటే విన్నాడా? " ఇట్లా అక్కడ చేరిన జనం రకరకాలుగా అనుకొంటున్నారు. క్రిస్టఫర్ తన తల్లిని హాస్పిటల్‌కు తరలించాడు. డాక్టర్ పరీక్ష చేస్తున్నాడు.

* * * *


డాక్టర్ క్రిస్టఫర్ భుజంపై చేయివేసి తటపటాయిస్తూ "సారీ క్రిస్టఫర్! యువర్ మదర్ ఈజ్ నోమోర్" అన్నాడు. "నో డాక్టర్! నో మా అమ్మ ఇక లేదనకండి. మా అమ్మ బ్రతికే వుంది. చచ్చిపోలేదని చెప్పండి డాక్టర్! చచ్చిపోలేదని చెప్పండి! " నీళ్ళు నిండిన కళ్ళతో, వణికి పోతున్న స్వరంతో, ఆవేశంగా డాక్టర్ భుజాలు ఊపుతూ అన్నాడు క్రిస్టఫర్. డాక్టర్ ఓదారుస్తూ "ఔను క్రిస్టఫర్! మీ అమ్మ చచ్చిపోలేదు. ఈ సమాజం చేత చంపబడింది. దెయ్యాలూ భూతాలూ ప్రేతాలనే అభూత కల్పనలతో భయాలు సృష్టించి మానవాళిని నిర్వీర్యం చేస్తున్న ఈ సమాజానిదే ఆ పాపం. వాస్తవంగా ఆ చర్చి మెట్లపై ఏ క్షుద్రశక్తీ లేదు. ఏ క్షణాన ఏ క్షుద్ర శక్తి నిన్ను ఆవహిస్తుందోనన్న భయం మీ అమ్మను కుదిపేసింది. ఆ మానసిక సంఘర్షణను తట్టుకోలేకే ఆమె చచ్చిపోయింది. అలాంటి మానసిక సంఘర్షణకు లోనయ్యే అనేక మంది ఆ మెట్లపై ప్రాణాలొదిలారు. అంతే– అదీగాక మీ అమ్మగారు హార్టు పేషెంట్ కూడాను..."

ఆ మాటలు క్రిస్టఫర్‌కు వినబడటం లేదు. కొద్ది క్షణాలు విజయగర్వంతో వెలిగిన అతని కళ్ళు ఇప్పడు విషాదాశ్రువులతో నిండిపోయాయి. ఉద్వేగంతో చేతులు చాచి నిలబడిన అతని తల్లే అతని కళ్ళలో మెదులుతోంది. తల్లి తలపులే అతని హృదయాన్ని కుదిపేస్తున్నాయి. దుఃఖం అతనిని కమ్మేసింది.

* * * *

ఈ నాటికీ క్రిస్టఫర్‌ని విషాదం వీడనేలేదు. కారణం ఆ చర్చిలో నేటికీ వివాహాలు జరగటం లేదు. ఆ చర్చిలో వివాహం చేసుకొంటే ఆ ముప్పై మెట్లూ దిగేలోపు వధూవరులో లేక వారి తల్లిదండ్రులో ఎవరో ఒకరు చావటం తప్పదన్న మూఢ నమ్మకం రక్కెసపొదలా ఈ సమాజం చుట్టూ అల్లుకు పోయింది.

## అరడజను హైకూలు



వాడు తాళికట్టాడు
అంతే
వసంతం వెళ్ళిపోయింది.

నగరం వీధిలో
చినవాటి వేస్తం
బాడిదగింజ చురక.

కుక్కిమంచం
వీపంతా చీమలు
ఇంకా ఏముందనో!

దర్భపిండాలు
చెరువంతా
కప్పవెత్తురు

ఎంతభయం
తొడిమవదిలే రేగుపండు
ముల్లుమీద ఆత్మహత్య

ఎదగకే
ఈతగెలా!
ముళ్ళు గుచ్చుకుంటాయి.

* అంకితం:
హైకూల
"గాలి" సోకించిన వాజర్‌రెడ్డికి.

–బేతవోలు రామబ్రహ్మం

## ఇకనైనా తప్పుకోండి...

కడుపులోని చల్ల కదలకుండా
హాయిగా చల్లదనాల మీ పాలరాతి మేడల
పై అంతస్తులో మెత్తమెత్తని హంస తూలికా తల్పాలపై నిద్రించి
మీరు కన్న నీలి స్వప్నాల నుంచి తేరుకోకముందే...
మీ జీవితాలనీ సంపదల సర్వస్వాన్నీ
భీమా చేయించుకున్న కాయితాలని
ఇనుప బీరువాల్లో పెట్టి తాళాలేసేసుకుని...
మీరు నివసిస్తున్న సురక్షిత భద్రతా క్షేత్రపు
పరిహద్దుల నుంచి బయటకు రాకుండానే...
మీ ఉన్నత సౌధ గవాక్షాల గుండా వీక్షించినంత మాత్రానే...
బడుగు బతుకుల బాధల్ని గురించి
ఏ ఆర్ద్రతతో రాస్తున్నారు?
ఒడ్డున కూర్చున్న మీరు
జీవన కాసారంలోని కల్లోలాన్ని గురించి
ఏ ఆర్ద్రతతో మాట్లాడుతున్నారు?

గుండె కదిలి, మనసు పిలిచి, కళ్ళు చెమ్మగిల్లి...
అంటూ బుకాయించబోకండి
బలిసిన మీ వొళ్లు కాస్త అలిస్తే చాలు
గుండె వేగంగా కదిలిపోతూనే వుంటుంది...
మీరు చేసే ఆకలి కేకల అనుకరణలకు మెచ్చిన ప్రభువులు
మీకు చెయ్యబోయే సన్మానాలు
మీ మనసుని పిలుస్తూనే వుంటాయి...
జన జీవన స్రవంతిలో చెలరేగిన పోరాటాల ధూళి
నేరుగా మీ కళ్ళల్లోనే చిమ్మితే
అవి చెమ్మగిల్లక మరేమవుతాయి?

ఇప్పటికైనా చాలించండి మీ ప్రకోపిత పైత్య ప్రలాపాన్ని
ఇకనైనా ఆపండి మీ అక్షర ధ్వన్యనుకరణా నైపుణ్య ప్రదర్శనని
చేతనైతే మీరూ వచ్చి మాతో కలవండి
పోరాట క్షేత్రంలో నెత్తురు చిందించడానికి సంసిద్ధులవండి
చేతగాకుంటే
చేవ చచ్చిన చేతుల్తో చెక్క భజనలు చేసుకోండి
సత్తువన్నది మీలో నిజంగా వుంటే
కష్టాల కడలిలో మాతోపాటు ఎదురీత నీదండి
లేకుంటే
మీ రాజకీయాల మురుక్కాలువల్లో పందుల్లా పొర్లండి
మాకేం అభ్యంతరం లేదు
మా అభ్యంతరమంతా
మీరు మా మీద వటిస్తున్న సానుభూతిపైనే
మీరు మా కోసం కారుస్తున్న మొసలి కన్నీటిపైనే...

మహా మహా కవులారా!
శత సహస్ర బిరుదాంకితుల్లారా!!
మీ శకం అయిపోయిందని కాస్త గ్రహించండి
కృత్రిమ కాంతులలో వెలుగుతున్న అభినవ రవులారా!
మీ పొద్దు కుంగిపోతూందని కొంచెం తెలుసుకోండి...

మీరు సృష్టించిన తిమిరంపై
సమర శంఖాలమై ప్రతిధ్వనిస్తున్న
అక్షర కిరణ కాంతి శరాలం మేం...
బతుకు బండరాళ్లపై సానబట్టుకున్న
అనుభవాల వజ్రాయుధాల్తో విజృంభిస్తున్న వీరులం మేం...
కంటకారణ్యాల్లో
మా కలల పంట పండించుకోడానికి
కత్తుల్ని దూస్తున్నవాళ్లం మేం...

మా దారి నుంచి మర్యాదగా తప్పుకోండి
అడ్డు తగిలితే కుత్తుకల్ని కత్తిరించడానికైనా వెనుదియ్యం...



– పన్నాల జగన్నాథదాసు